andhrajyothy.com
# ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 ; కనిష్ఠం 17.6



నిర్మల్
జిల్లా వార్తలు

మంగళవారం 24 డిసెంబరు 2024

ప్రజా సమస్యలను

## చట్ట పరిధిలో పరిష్కరించండి : ఎస్పీ

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని ఎస్పీ జానకి షర్మిల పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరించారు. పలు సమస్యలపై అందిన ఫిర్యాదులపై స్పందించిన ఎస్పీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. శాంతిభద్రతలు పర్యవేక్షిస్తూ ప్రజల మన్ననలు పొందేలా ముందుకుసాగాలని సూచించారు. ప్రజలు మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా పోలీసుస్టేషన్‌కు వచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు.

# నామినేటెడ్‌పై అసంతృప్తి



» మార్కెట్, దేవాలయాల కమిటీల పదవుల కోసం ఎదురుచూపులు
» ఏడాది నుంచి భర్తీకాక కాంగ్రెస్ శ్రేణుల్లో నిరాశ
» ముథోల్‌లో మాజీ ఎమ్మెల్యేల మధ్య కోల్డ్‌వార్
» ఆధిపత్య పోరుతో ఆగిన పదవుల పంపకం

నిర్మల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నామినేటేడ్ పదవుల పంపిణీ వ్యవహారం జిల్లాలో ఆసక్తికరంగా మారుతోంది. నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో పెద్దగా గ్రూపులు లేకపోయినప్పటికి ముథోల్ నియోజకవర్గంలో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల మధ్య కొనసాగుతున్న కోల్డ్‌వార్ నామినేటేడ్ పదవుల పంపకానికి ఆటంకంగా మారుతోందని అంటున్నారు. అయితే ఎలాంటి ఆటంకాలు లేకున్నా ఖానాపూర్ నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి నియామక వ్యవహారం చర్చకు తావిస్తోంది. ఇక్కడి ఎమ్మెల్యే వెడ్మబొజ్జు సిఫారసు చేసిన వారికే పదవి దక్కడం ఖాయమైనప్పటికీ మార్కెట్ చైర్మన్ పదవి ఇప్పటికీ భర్తీకాకపోవడంపై చర్చ జరుగుతోంది. ముథోల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేలు నారాయణరావు పటేల్, విఠల్‌రెడ్డిల మధ్య కొనసాగుతున్న ఆధిపత్య పోరు కారణంగా కుభీర్ మార్కెట్ కమిటీ పాలకవర్గంతో పాటు పవిత్రమైన బాసర సరస్వతీదేవి ఆలయ పాలకవర్గ సభ్యుల నియామకం ఇప్పటికీ పూర్తికావడం లేదు. పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజుల్లోనే తమకు పదవులు కేటాయించి ఉన్ననట్లయితే ఇప్పటికే ఏడాది కాలం గడిచిపోయేదని పార్టీ సీనియర్ నేతలు వాపోతున్నారు. ముఖ్యంగా రాజకీయ కేంద్రంగా పేరున్న జిల్లాలో అధికార కాంగ్రెస్ పార్టీ సీనియర్‌లు నామినేటేడ్ పదవుల కోసం రాష్ట్రస్థాయి నేతలపై తీవ్రమైన ఒత్తిళ్లు కొనసాగుతున్నాయంటున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో ఐదు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు గాను మూడు మార్కెట్ కమిటీ పదవులతో పాటు డైరెక్టర్ పదవులను నియమించారు. ఇంకా రెండు మార్కెట్ కమిటీ పాలకవర్గాలు నియమకాలు ఇప్పటికి కూడా భర్తీ కాకపోవడం ఆ ప్రాంతాలకు చెందిన సీనియర్ నేతలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవితో పాటు కుభీర్ మార్కెట్ కమిటీ పదవులను అలాగే ఈ రెండు కమిటీల డైరెక్టర్ పదవులను సైతం ఇప్పటి వరకు నియమించపోవడానికి పలు రాజకీయ కారణాలు ఆటంకంగా మారినట్లు కూడా పేర్కొంటున్నారు. ముథోల్ నియోజకవర్గ పరిధిలో కుభీర్ మార్కెట్ కమిటీ ఉన్న కారణంగా అక్కడ ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల ఒత్తిళ్లతో పాలకవర్గాల నియమకాలు జరగడం లేదంటున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులతో పాటు ప్రధానమైన దేవాలయాల కమిటీ పాలకవర్గాల నియమకాలు కూడా ఇప్పటికి జరగకపోవడం పట్ల కాంగ్రెస్ సీనియర్‌లు తీవ్ర అసహనానికి లోనవుతున్నారు. జిల్లాలోనే ప్రాశస్త్యం ఉన్న అడెల్లి మహాపోచమ్మ ఆలయ కమిటీని అలాగే కాల్వ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ కమిటీ పాలకవర్గాల నియామకాలు ఇప్పటి వరకు కూడా జరగలేదు. దీంతో పాటు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ ఆలయ కమిటీ పాలకవర్గాన్ని కూడా ఇప్పటి వరకు నియమించకపోవడం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినప్పటికీ ఇప్పటి వరకు నామినేటేడ్ పదవుల నియామక ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పార్టీ కోసం శ్రమించిన సీనియర్ నేతలు తమ రాజకీయ భవిష్యత్‌పై ఆందోళనకు గురవుతున్నారు. నామినేటేడ్ పదవులను ఆశిస్తున్న నేతలంతా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీహరిరావుపై గత కొద్దిరోజుల నుంచి తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పదవులను ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో పాటు స్థానిక రాజకీయాల కారణంగా నియామక ప్రక్రియ ఆలస్యమవుతుందంటున్నారు. అయితే ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తయినందున ఇప్పటికైనా మార్కెట్, దేవాలయాల కమిటీల పాలకవర్గాలను నియమించాలని పార్టీ కార్యకర్తలు కోరుతున్నారు.

### రెండు మార్కెట్ పాలకవర్గాలపై ఆసక్తి

జిల్లాలోని ఖానాపూర్, కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులపై ఆ రెండు ప్రాంతాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఏడాది నుంచి ఆశలు పెట్టుకుంటూ అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై ఆ ప్రాంత సీనియర్ కాంగ్రెస్ నేతలు చాలా మంది ఆశలు పెట్టుకున్నారు. అయితే ఇక్కడ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు సూచించిన వారికే ఆ పదవి దక్కడం ఖాయం. ఇప్పటికే చాలా మంది సీనియర్లు పదవి కేటాయించాలంటూ ఎమ్మెల్యేపై ఒత్తిడి కొనసాగిస్తున్నారు. అయితే ఆశావాహుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పదవి ఖరారుపై మల్లగుల్లాలు పడుతున్నారంటున్నారు. ఇక్కడి పదవి ఎస్టీలకు రిజర్వ్ కావడంతో ఆ వర్గానికి చెందిన సీనియర్ నాయకులు బొడ్డు గంగన్న అలా గే మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దుర్గాభవాని, రాచమల్ల అశోక్ తదితరులు ఈ పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. అలాగే ముథోల్ నియోజకవర్గంలోని కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవితో పాటు డైరెక్టర్ల నియామక వ్యవహారం అక్కడి ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల కారణంగా జాప్యమవుతున్నట్లు పేర్కొంటున్నారు. ఇక్కడి నుంచి సతీశ్, కల్యాణ్, శంకర్‌చంద్రె, రాహుల్‌తో పాటు మరికొంతమంది మార్కెట్ చైర్మన్ పదవి కోసం పట్టుబడుతున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల ప్రభావంతో నియామక ప్రక్రియలో జాప్యం జరుగుతున్నట్లు చెబుతున్నారు.

### దేవాలయ పాలకవర్గాల నియామకంలో సైతం జాప్యం

బాసర సరస్వతీదేవి ఆలయ కమిటీ పాలకవర్గాల నిమామకంలో తీవ్రమైన జాప్యం జరుగుతుండడం పట్ల పార్టీ నాయకులే కాకుండా భక్తులు సైతం తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. ఆలయ ట్రస్టు సభ్యులను ఇప్పటి వరకు నియమించకపోవడం పట్ల ఆశావాహులు అసంతృప్తికి గురవుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 15 మంది డైరెక్టర్‌ను నియమించింది. అయితే అదే సంప్రదాయాన్ని ఈ సారి కూడా కొనసాగించి డైరెక్టర్‌ల నియామక ప్రక్రియను చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరుతున్నారు. దీంతో పాటు మరో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అడెల్లి మహాపోచమ్మ ఆలయ పాలకవర్గాన్ని సైతం ఇప్పటి వరకు నియమించకపోవడంపై కాంగ్రెస్ శ్రేణుల్లో అసంతృప్తి రాజుకుంటోంది. ఆలయ కమిటీ చైర్మన్ పదవి కోసం డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుకు సన్నిహితుడైన సత్యాపాల్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దశరథ రాజేశ్వర్ కూడా ఈ పదవిని ఆశిస్తుండడంతో నియామక వ్యవహారంలో జాప్యం జరుగుతున్నట్లు చెబుతున్నారు. అలాగే కాల్వ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ పాలకవర్గ నియామక ప్రక్రియ కొలిక్కి వచ్చిందంటున్నారు. కాల్వ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా శ్రీహరిరావుకు సన్నిహితుడైన మహేందర్ నియామకం దాదాపు ఖరారైందని చెబుతున్నారు. అయితే ఇప్పటి వరకు అధి కారిక ఉత్తర్వులు వెలువడకపోవడంతో ఆ పార్టీ నేతల్లో సందిగ్ధత నెలకొంటోంది.

### ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల మధ్య కోల్డ్‌వార్

ఇదిలా ఉండగా జిల్లాలోని ముథోల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, నారాయణరావు పటేల్‌ల మధ్య కొనసాగుతున్న కోల్డ్‌వార్ ఆ పార్టీ సీనియర్ నేతలకు ఇక్కట్లను సృష్టిస్తోందని అంటున్నారు. నామినేటేడ్ పదవుల విషయంలో వీరిద్దరు తమ అనుయాయులకే ప్రాధాన్యతనివ్వాలంటూ పట్టుబడుతుండడం అధిష్టానానికి సైతం తలనొప్పిగా మారిందని చెబుతున్నారు. అయితే ప్రస్తుతం నియోజకవర్గ పార్టీ ఇంచార్జీగా వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ తన పంతం నెగ్గించుకునేందు కోసం అధిష్టానంపై ఒత్తిడి తీసుకువస్తున్నారంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన విఠల్‌రెడ్డి ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరడమే కాకుండా పదవుల విషయంలో పట్టుబడుతుండాన్ని నారాయణరావు పటేల్ వర్గీయులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులతో పాటు పదవుల కేటాయింపుల వ్యవహారం మొత్తం అధిష్టానం మొదట్లో నారాయణరావు పటేల్‌కే అప్పగించినప్పటికీ కొత్తగా పార్టీలో చేరిన మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ఆధిపత్యం చెలాయించే ప్రయత్నాలు చేయడాన్ని సీనియర్‌లు వ్యతిరేకిస్తున్నారు. మొత్తానికి ఈ నియోజకవర్గంలో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేల వ్యవహారం సీనియర్ నేతలకు పదవులు కేటాయించే విషయమై ఆటంకాలను కల్పిస్తోందని అంటున్నారు.

## 5వ తేదీ నుంచి క్రికెట్ టోర్నమెంట్

కుభీర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుభీర్‌కు చెందిన మణికంఠ క్రికెట్ టీం ఆధ్వర్యంలో కీ.శే చెంచుల సాయినాథ్ స్మారకార్థం జనవరి 5వ తేదీ నుంచి క్రికెట్ టౌర్నమెంట్‌ను ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు సూది గంగాధర్‌స్వామి, రంజిత్‌లు తెలిపారు. ఆసక్తి గల వారు జనవరి 1వ తేదీ నుంచి జనవరి 10వ తేది వరకు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఎంట్రీ ఫీజు రూ. 1500, మొదటి బహుమతి రూ.21,000, రెండవ బహుమతి రూ.11,000 ఉందని తెలిపారు. వివరాలకు 9912065315, 8465892977, 9640455035, 9603263943 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఆక్రమిత భూమిని

## స్వాధీనం చేసుకోవాలి : సీపీఐ

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ మండలం పాత ఎల్లాపూర్ గోసంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అసైన్డ్ భూమి ఆక్రమణకు గురైందని దానిని స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని సీపీఐ కార్యదర్శి ఎస్. విలాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... సర్వేనెంబర్ 267/8, 267/7 ఆనుకుని ఉన్న భూమి సత్తెనపల్లి పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ అనే వ్యక్తి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి ఉపయోగపడేలా చూడాలని పేదల ప్రజల ఇళ్లకు కేటాయించాలని కోరారు. గతంలో తహసీల్దార్ కార్యాలయంలో తగు చర్య కోసం వినతిపత్రం అందజేశామని సీనియర్ నాయకుడు ఎస్ఎన్ రెడ్డి తెలిపారు. ఉపాలి, భూక్యా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత డెంటల్ క్యాంప్



కుభీర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిగ్వా ఉన్నత పాఠశాలలో సోమవారం ఉచిత డెంటల్ క్యాంపు నిర్వహించారు. క్లేవ్ డెంటల్ ఆధ్వర్యంలో డా.నాంపెల్లి అక్షయ్‌కుమార్ విద్యార్థులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీజీహెచ్‌ఎం విజయ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ దొంతుల దేవిదాస్, ఎస్టీయూ అడిషనల్ జనరల్ సెక్రటరీ, నరసింహచారి, తుల శ్రీనివాస్, పోశెట్టి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉట్నూరులో 28న జాబ్‌మేళా



ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్తా

నిర్మల్ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారిని కుష్బూ గుప్తా తెలిపారు. ఏడవ తరగతి, ఆపై విద్యార్హతతో సీతారాం స్పిన్నర్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ కంపెనీలో 300ల ఉద్యోగాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధ్రువపత్రాలతో కొమరం భీం ప్రాంగణంలోని యువజన శిక్షణ కేంద్రం ఉట్నూర్ నందు నిర్వహించే ఇంటర్వ్యూకి హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9493535052 నందు సంప్రదించాలని తెలిపారు.

ఖానాపూర్ జేఎఫ్‌సీఎం కోర్టు

## ఏజీపీగా ఆసిఫ్‌అలీ బాధ్యతల స్వీకరణ



ఖానాపూర్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయాధికారి జితిన్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏజీపీ ఆసిఫ్‌అలీ

ఖానాపూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ జేఎఫ్‌సీఎం కోర్టు ఏజీపీగా ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ద్వారా నియమితులైన న్యాయవాది ఆసిఫ్ అలీ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక కోర్టులో మెజిస్ట్రేట్ జితిన్ కుమార్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఖానాపూర్ కోర్టు తొలి ఏజీపీగా నియమితులైన ఆసిఫ్ అలీని మెజిస్ట్రేట్ జితిన్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు వెంకట మహేంద్ర, మట్టేరి రాజశేఖర్, బాశెట్టి శివ, షబ్బీర్ పాషా, రాజలింగం, షేక్ అంజర్, ఖదీర్, తదితరులున్నారు.



## మహిళలు అన్ని రంగాల్లో స్వశక్తితో ఎదగాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో స్వశక్తితో ఎదగాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'లోకల్ ఫర్ వోకల్ అనే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈడీఐఐ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని ఆరు మండలాల స్వయం సహాయక సంఘ మహిళలు చేతివృత్తులు, ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకుల తయారీ, ప్యాకింగ్‌పై శిక్షణను పూర్తి చేసుకొని వారు తయారు చేసిన వస్తువుల స్టాళ్లను రిబ్బన్ కత్తిరించడం ద్వారా ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి ఆర్థికంగా బలపడాలని తెలిపారు. మహిళా స్వయం సంఘాలతో చేరడం ద్వారా మహిళా సాధికారత సాధించవచ్చునని తెలిపారు. పొదుపు ఆవశ్యకతను మహిళలకు కలెక్టర్ వివరించారు. మహిళలు శిక్షణను పూర్తి చేసుకొని తయారు చేసిన వస్తువులను ఒకచోట అమ్మేందుకు వీలుగా తగు ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. స్వయం సహాయక మహిళలు తయారు చేసిన వస్తువులను పరిశీలించి నాణ్యతవంతంగా ఉన్నాయని అభినందనలు తెలియజేశారు. మహిళా స్వయం సంఘాల ఉత్పత్తులు కేవలం జిల్లాకే పరిమితం కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా సప్లై చేసే విధంగా ఎదగాలన్నారు. మహిళా స్వయం సంఘాలకు శిక్షణను ఇచ్చిన ఈడీఐఐ సంస్థ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వాలు మహిళల ఎదుగుదలకు ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగపరుచుకొని అన్ని రంగాల్లో ఉన్నతంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మి, మెప్మా పీడీ సుభాష్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, నిర్మల్ పట్టణ తహసీల్దార్ రాజు, సీడీపీవో నాగమణి, లక్ష్మణచాంద ఎంపీడీవో రాథోడ్ రాధా, ఈడీఐఐ ప్రాజెక్టు అధికారి భూపతి, మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయ, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడక గదుల ఇళ్ల వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరుచాలని ఆదేశించారు. దరఖాస్తుదారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు మూడు పూటల కామన్ డైట్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ప్రత్యేక అధికారులంతా నిరంతరం వసతి గృహాల్లో అమలవుతున్న కామన్ డైట్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ప్రత్యేక అధికారులంతా నిరంతరం వసతిగృహాల్లో అమలవుతున్న కామన్ డైట్ విధానాన్ని పర్యవేక్షించాలని తెలిపారు. ఆ తర్వాత ఇటీవలే జాతీయ స్థాయిలో అవార్డులు సాధించిన గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ శాలువాతో సన్మానించి అభినందించారు. మున్ముందు జిల్లా ఖ్యాతిని మరింత చాటాలని ఆకాంక్షించారు. అధికారులు, సిబ్బంది మాట్లాడుతూ... జాతీయ స్థాయిలో అవార్డు సాధించడానికి సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపి అవార్డు స్వీకరణ సందర్భంగా కలిగిన అనుభవాలను అధికారులతో పంచుకున్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్షా ఉద్యోగులపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



ఒంటికాలిపై నిలబడి నిరసన



మాట్లాడుతున్న మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక రిలే దీక్షకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. సోమవారం దీక్ష శిబిరం సందర్శించి మాట్లాడుతూ... సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండివైఖరి వీడి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వారిని క్రమబద్ధీకరించాలని, పేస్కేల్ ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, నాయకులు రావుల రాంనాథ్, మాజీ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### ఒంటి కాలిపై నిలబడి నిరసన

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన సోమవారం 14 రోజుకు చేరింది. ఆర్డీవో కార్యాలయం ఎదుట పసుపు రంగు చీరలు ధరించి మహిళలు ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 19,350 మంది పని చేస్తున్నారన్నారు. జిల్లా అధ్యక్షుడు భూసారపు గంగాధర్, నవిత, లక్ష్మీ, రజిత, తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

### సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

సీఎం సహాయనిధి రూ.56 లక్షల చెక్కులను ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సోమవారం అందజేశారు. నియోజకవర్గంలోని 220 మంది లబ్ధిదారులు చెక్కులు అందుకున్న వారిలో ఉన్నారు. నాయకులు పాల్గొన్నారు.

## ఆలయంలో చోరీకి విఫలయత్నం

కుభీర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పార్డి(బి) రాజరాజేశ్వర ఆలయంలో సోమవారం వేకువజామున 3గంటలకు గుర్తుతెలియని దుండగులు హుండీ చోరీకి విఫలయత్నం చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. గత వారం రోజుల క్రితం కూడా ఆలయంలోని హుండీని పగలగొట్టి సుమారు లక్ష రూపాయలు చోరీ చేశారని తెలిపారు. ఈ సంఘటన మరువకముందే మరోసారి సోమవారం వేకువ జామున రాజరాజేశ్వర ఆలయంలోకి ఒక మహిళ, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ మండపంలోకి ప్రవేశించి అక్కడే ఉన్న హుండీ తాళాన్ని పగలగొట్టేందుకు ప్రయత్నించారు. పగలక పోవడంతో ఏకంగా హుండినే ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించి ఆలయ ప్రధాన గేటు వరకు హుండీని లాగుకుంటూ తెచ్చారు. అంతలోనే గ్రామస్థులు ఏదో శబ్దం వస్తోందని ఆలయం వైపు టార్చీలు వేయగా గమనించి దుండగులు కారులో భైంసా వైపు పరారయ్యారని తెలిపారు. గ్రామస్థులు వెంటనే 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వడంతో భైంసా పోలీసులు చోరీ యత్నం చేసి వెలుతున్న కారును భైంసా మండలం మహాగామ్ వద్ద పట్టుకొని కుభీర్ పోలీస్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈ విషయమై భైంసా రూరల్ సీఐ నైలుకు వివరణ కోరగా పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

## జిల్లా స్థాయి సీఎం కప్ పోటీల్లో విజేతలను సన్మానించిన గ్రామస్థులు



సన్మాన గ్రహీతలతో గ్రామస్థులు

తానూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరిగాం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు మల్లేష్, వైభవ్ గత వారం రోజుల కిందట జిల్లా కేంద్రంలో ప్రభుత్వం నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో పాల్గొన్నారు. పరుగుపందెంలో జిల్లా మొదటిస్థానంలో మల్లేష్ అలాగే, జీవశాస్త్రం రాతపరీక్ష పోటీల విభాగంలో రెండవస్థానంలో వైభవ్ గెలుపొందారు. విద్యార్థులను మాజీ మండల కోఆప్షన్ మెంబర్ చంద్రకాంత్‌యాదవ్, బోరిగాం పెద్దలు, గ్రామస్థులు సోమవారం పాఠశాల ఆవరణలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో కూడా రాణించాలని జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని అన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందడంతో పాఠశాలకు గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చారని కొనియాడారు. ఈ నెల 28న రాష్ట్ర స్థాయి పరుగు పందెంలో పాల్గొనడానికి మల్లేష్ వెళ్తున్నట్లు ప్రధాన ఉపాధ్యాయుడు శంకర్ తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల క్షేత్ర సందర్శన

కుంటాల, డిసెంబరు, 23 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మాడల్ పాఠశాల విద్యార్థులను సోమవారం కల్లూరు గ్రామీణ బ్యాంకులో క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాంకు వచ్చిన సందర్భంగా మేనేజర్ మేఘన బ్యాంకులో ప్రతినిత్యం చేపట్టే లావాదేవీల గురించి విద్యార్థులకు వివరించారు. బ్యాంకు ద్వారా ఖాతాదారులకు, రైతులకు ప్రతీ రోజు అందించే సేవల గురించి మేనేజర్ మేఘన వివరించారు.



కలశ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## రాజులతండాలో ఘనంగా కలశ పూజ

నేరడిగొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులతండా గ్రామంలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయ కలశ పూజ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కలశాన్ని బుద్దికొండ శ్రీశబరిమాతా ఆలయ నుంచి రాజులతండా గ్రామం వరకు ఊరేగించగా.. శబరిమాత ఆశ్రమం వద్ద ఎమ్మెల్యే పూజలు చేసి ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, బుద్దికొండ మాజీ సర్పంచ్, సోనాల సర్పంచ్ సదానందం, ప్రతాప్‌సింగ్, సరించంద్, లింబాజీ, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, రాజులతండా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ పాల్గొన్నారు. అనంతరం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన శోభాయాత్రలో బుద్దికొండ శబరిమాత ఆశ్రమం నుంచి నిర్వహించిన శోభాయాత్రలో ఆయన పాల్గొన్నారు.

## కోలాం గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

ఉట్నూర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పెరిగిన చలి తీవ్రత దృష్ట్యా మండలంలోని దొంగచింత గ్రామంలో నివాసం ఉంటున్న కోలాం గిరిజనులకు బెతెస్త మెర్సిఫుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. దొంగచింత గ్రామంలో అన్నదిగా ఉంటున్న పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఇందులో బెతెస్థ మెర్సిఫుల్ ట్రస్టు చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బత్తుల డానియల్, సభ్యులు పాల్గొన్నారు.

## 'సామాజిక సేవే భీం ఆర్మీ లక్ష్యం'

ఇంద్రవెల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవే భీం ఆర్మీ లక్ష్యమని ఆ సంఘం ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్వాగ్ సందీప్ అన్నారు. సోమవారం మండలంలోని బొడ్డిగూడ గ్రామంలో భీం ఆర్మీ ఆధ్వర్యంలో కొలాం ఆదివాసీ గిరిజనులకు చలి తీవ్రత దృష్ట్యా దుప్పట్ల పంపిణీతో పాటు చిన్నపిల్లలకు స్వెటర్లు అందజేశారు. ఇందులో మండల అధ్యక్షుడు సూర్యవంశీ ఉత్తమ్, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకుడు కాంబ్లే అతీష్, సింగారి కిరణ్, కాంబ్లే రాజేందర్, వాగ్మారే విశాల్, తదితరులు పాల్గొన్నారు.

## 'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం'

సిరికొండ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని నిజాంగూడ గ్రామ పటేల్ మెస్రం జంగు అన్నారు. సోమవారం మండలంలోని నిజాంగూడ గ్రామం నుంచి రాంపూర్‌గూడ గ్రామం వరకు రూ.4 లక్షలతో మట్టిరోడ్డు పనులకు భూమిపూజ చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్నివిధాల అభివృద్ధి అవుతోందన్నారు. ఇందులో నాగోరావ్, కుడ్మెత బండు, మెస్రం తులిసిరామ్, పర్చకే అమృత్‌రావ్, కోవ రాము, కోవ మాణిక్‌రావ్, మెస్రం తులిసీరామ్, మెస్రం కాశీరామ్, తదితరులు పాల్గొన్నారు.

## 'రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలి'

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలకు ఇచ్చిన హామీ ప్రకారం పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నవీన్ అన్నారు. పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ఏఎన్‌ఎంలు ధర్నా చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు వెళ్తామన్నారు. ఇందులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, ఏఎన్‌ఎంలు పుష్పల, ఆనందబాయి, తులసి, మమత, ప్రియదర్శిని, అహల్య, జ్యోతి, అన్నపూర్ణ, కరుణ, రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

# యాక్షన్ ప్లాన్ తయారు చేయాలి

● అధికారుల సమావేశంలో ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి):42 ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు ఇంగ్లీష్‌పై శిక్షణ ఇవ్వాలని అందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదిలాబాద్ డీఈవో ప్రణితను జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. కాగా, 42 ప్రభుత్వ పాఠశాలలు ప్రైమరి, యూపీఎస్ హెడ్మాస్టర్‌లు, టీచర్ల (రిసోర్స్ పర్సన్)తో సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ 1, 2 తరగతుల విద్యార్థులకు ఇంగ్లీష్‌లో చదవడం, రాయడంపై టీచర్లు ఇంగ్లీష్ సబ్జెక్టు పై పట్టు సాధించి ఇంగ్లీష్ దారాళంగా మాట్లాడే విధంగా టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం సంక్రాంతి పండుగ తర్వాత నిర్వహించడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు శ్రీకాంత్, సుజిత్‌ఖాన్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

● త్వరితగతిన స్థల సేకరణ చేయాలి

పట్టణంలో సేవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్(ఎస్‌టీపీ) నిర్మించేందుకు త్వరితగతిన స్థలం సేకరించి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. సోమవారం తన చాంబర్‌లో మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

● జాయింట్ సర్వే నిర్వహించి ప్రతిపాదనలు పంపాలి

విద్యుత్ సౌకర్యం లేని గ్రామాలకు త్రీఫేస్ కరెంట్ ఇచ్చేందుకు అటవీ, విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి కలెక్టర్ పలు సూచనలు చేశారు.

## విజిలెన్స్ కమిటీల ఏర్పాటులో నిర్లక్ష్యం

● ప్రజావేదికలో స్పష్టమైన ఉపాధి హామీ సిబ్బంది తీరు

ఉట్నూర్, డిసెంబరు 23(ఆంధ్‌రజ్యోతి): మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనుల పరిశీలన కోసం ప్రతి గ్రామంలో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేయడంలో ఉపాధి హామీ సిబ్బంది విఫలమయ్యారని అధికారులు తేల్చారు. సోమవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గత సంవత్సరం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు నిర్వహించిన ఉపాధి హామీ పనులపై రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభల అనంతరం మండల స్థాయి ప్రజావేదిక నిర్వహించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అడిషనల్ ప్రాజెక్టు ఆఫీసర్ కుటుంబరావు, ఎస్‌పీఎం వేణు, ఎస్‌ఆర్పీ తిరుపతి, అంబుడ్స్మెంట్ మీనా, ఏపీడీ కృష్ణారావు, ఎంపీడీవో రాంప్రసాద్, ఎంపీవో శ్రీధర్‌రెడ్డి, ఈజీఎస్ ఏపీఓ రజినికాంత్ ఆధ్వర్యంలో ప్రజావేదికలు నిర్వహించారు. ఇందులో రూ.7కోట్ల, 54లక్షల 72వేల 820తో కూలీలకు పనులు కల్పించగా.. రూ.44లక్షల 45వేల 887తో మెటీరియల్ చేపట్టిన పనులను గ్రామ సభలు నిర్వహించి ఎస్‌పీఎంటీలు తయారు చేసే నివేదికలపై చర్చించారు. ఈ సందర్భంగా కుటుంబరావు మాట్లాడుతూ క్షేత్ర స్థాయి సిబ్బంది పని తీరు మెరుగు పరుచుకోవాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు.

## మోకాళ్లపై కూర్చొని ఉద్యోగుల నిరసన

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తమ సర్వీసులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్షా ఉద్యోగులు చేపట్టిన సమ్మె 14 రోజుకు చేరుకుంది. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట టెంట్ వేసుకొని సమ్మె చేపడుతున్నారు. సమ్మెలో భాగంగా సోమవారం కలెక్టరేట్ దీక్ష శిబిరం నుంచి ఎన్టీఆర్ చౌటు వరకు ర్యాలీగా వెళ్లి మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. కాగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె శిబిరానికి ఎమ్మెల్సీ అభ్యర్థులు ప్రసన్న హరికృష్ణ, వి.నరేందర్ రెడ్డి వేర్వేరుగా వచ్చి తమ మద్దతు ప్రకటించారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం తమవంతు కృషి చేస్తామన్నారు.

## 27 వరకు పత్తి కొనుగోలు నిలిపివేత

బోథ్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని జిన్నింగులలో ఈనెల 25 నుంచి 27 వరకు పత్తి కొనుగోళ్లను నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేట్ సెక్రెటరీ విఠల్ తెలిపారు. రైతులు విషయాన్ని గమనించి మార్కెట్‌లోకు పత్తిని తీసుకురావద్దని తెలిపారు.

## ఆదిలాబాద్ వాసికి ఛత్తీస్‌గడ్‌లో అవార్డు

ఆదిలాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఆదిలాబాద్ పట్టణానికి చెందిన చవాన్‌రాణా ఆశిష్ ఆదివారం ఛత్తీస్‌ఘడ్‌లో అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగిన 46వ పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ అవార్డులో భాగంగా పీఆర్, బ్రాండింగ్ కోసం అత్యంత ఆకర్షణీయమైన ఈవెంట్ మేనేజ్‌మెంట్‌ను సోషల్ మీడియా కోసం అవార్డును పొందారు. దాదాపు 3రోజుల పాటు కొనసాగిన కాన్ఫరెన్స్ పబ్లిక్ రిలేషన్స్, నిపుణులు ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించారు. ఇందులో దేశవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ కమ్యూనికేషన్స్, పీఆర్ నిపుణులు పాల్గొన్నారు.

## రూరల్ పోలీస్ స్టేషన్ తనిఖీ

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ జీవన్ రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. ముందుగా స్టేషన్ ఆవరణలో సీఐ ఫణిధర్, ఎస్సై ముజాహిద్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ద్వారా ఏర్పాటు చేసిన డ్రిల్‌ను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకొని వాటి ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు.

## అక్రమ కలప పట్టివేత

ఇచ్చోడ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లమ్మగూడ అటవీ ప్రాంతంలో అక్రమంగా నిల్వ ఉంచిన కలప సైజులను పట్టుకున్నట్లు అటవీశాఖ టాస్క్ ఫోర్స్ ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సిరిచెల్మ బీట్ ప్రాంతంలోని ఎల్లమ్మగూడ అటవీ ప్రాంతంలో నరికిన 20 టేకు చెట్ల కలప సైజులను ఆయన పేర్కొన్నారు. దాదాపు రూ.30వేల విలువ ఉంటుందని తెలిపారు. కాగా, ప్రాథమిక విచారణలో గుండాల గ్రామానికి సంబంధించిన నలుగురు ఉన్నట్లు తెలిసిందన్నారు. పట్టుకున్న కలపను సిరిచెల్మ అటవీశాఖ క్వార్టర్‌కి తరలించామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఓ కవిత, ఎఫ్‌బీఓలు సజన్‌లాల్, శ్యాంసుందర్, సుభాష్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో మైనర్ మృతి

ఉట్నూర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగాపూర్‌కు చెందిన 11ఏళ్ల మైనర్ పంట చేనులో అనుమానాస్పదస్థితిలో మృతి చెందిందని సబ్ ఇన్స్‌పెక్టర్ మనోహర్ తెలిపారు. దేవాపూర్ శివారులోని పంట చేనులో బాలిక ఉరేసుకునట్లు గ్రామస్థుల ద్వారా తెలిసిందన్నారు. బాలిక తండ్రి ఎల్లయ్య ద్వారా సమాచారం సేకరిస్తున్నామని తెలిపారు.

## అసంపూర్తిగానే రుణమాఫీ!

(5వ పేజీ తరువాయి...)

రుణమాఫీ చేసి రైతు భరోసాను వెంటనే ఇవ్వాలని ఉరి తాళ్లతో రైతులు వినూత్న నిరసన చేపట్టారు. చాలా మంది రైతులు వ్యవసాయ శాఖ, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రుణమాఫీపై ఫిర్యాదులు చేస్తున్నారు. గతంలో బ్యాంకుల ముందు రైతులు నిరసనలు చేపట్టిన దాఖలాలు కూడా ఉన్నాయి. ఇక రుణమాఫీ కోసం ఎదురుచూసే ఓపిక లేక రైతులు నిరసనలకు దిగుతు ఆందోళనబాట పడుతున్నారు. రైతులకు ప్రతిపక్షాలు, రైతు సంఘాల నేతలు అండగా నిలవడంతో ఆందోళనలు ఉధృతంగా మారుతున్నాయి. ఇకనైనా ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు.

### రూ.2లక్షలకు పైగా రుణం మాటేమిటి?

ప్రభుత్వం రూ.రెండు లక్షల వరకు రుణం ఉన్న రైతులకు రుణమాఫీ చేశామంటూ చెబుతున్నా.. ఇంకా అసంపూర్తిగానే కనిపిస్తోంది. రూ.రెండు లక్షలకు పైబడిన రుణాలపై స్పష్టత కనిపించడం లేదు. ప్రభుత్వం విధి విధానాలను ఖరారు చేయకపోవడంతో అధికారులు సైతం సరైన సమాధానం ఇవ్వడం లేదు. కుటుంబానికి రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ రూ.రెండు లక్షల లోపు ఉన్న రుణాలు కూడా మాఫీ కావడం లేదు. ఎందుకంటే ఒక కుటుంబంలో ఇద్దరు భార్యాభర్తలు పంట రుణాలను తీసుకున్నారు. ఒకరికి రూ.లక్షా 50వేలు రుణం ఉంటే.. మరొకరికి రూ.80 వేల రుణం ఉంది. కానీ ఈ ఇద్దరి రుణం కలిపితే రూ.రెండు లక్షల 30వేలు అవుతుంది. దీంతో కుటుంబంలో రూ.రెండు లక్షలకు పైగా రుణం ఉందన్న కారణంగా ప్రభుత్వం రుణమాఫీ చేయడం లేదు. అయితే కుటుంబంలో రూ.రెండు లక్షల లోపు ఉన్న ఒకరికన్న రుణమాఫీ చేస్తే బాగుంటుందని రైతులు చెబుతున్నారు. కుటుంబ సభ్యుల పేరిట ఉన్న రుణాన్ని మొత్తం కలిపి ప్రభుత్వం లెక్కలు చూపడం ఏమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కుటుంబంలో ఒకరికి కూడా రుణమాఫీ కావడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ ఆనాలోచిత విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇకనైనా ప్రభుత్వం కుటుంబంలో ఒకరికైనా రుణమాఫీ చేస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### తప్పని ఎదురుచూపులు

రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ ప్రక్రియను నాలుగు విడతల్లో చేపట్టింది. ఇప్పటి వరకు మూడు విడతల కింద విడుదల చేసిన నిధులు రైతులకు అందాయి. కానీ నవంబరు 30న నాల్గవ విడతలో విడుదల చేసిన రుణమాఫీ డబ్బులు ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో జమ కావడం లేదని రైతులు చెబుతున్నారు. అధికారులు కూడా దీనిపై స్పష్టమైన సమాధానం ఇవ్వడం లేదు. ప్రభుత్వం విడుదల చేస్తేనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని పేర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా నాల్గవ విడతలో 6,607 మంది రైతులకు రుణమాఫీ జరిగింది. కానీ ఇప్పటి వరకు నిధులు జమ కాక పోవడంతో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. అలాగే ఏజెన్సీ, ఇతర ప్రాంతాల్లో పహనీలపై పంట రుణాలను తీసుకున్న రైతుల పరిస్థితి కూడా గందరగోళంగా మారింది. పహనీ పంట రుణాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ మారుమూల గ్రామాలకు చెందిన రైతులే ఎక్కువగా ఉన్నారు. వివిధ సమస్యలతో జిల్లావ్యాప్తంగా మరో 30 వేల మంది రైతులకు రుణమాఫీ జరుగాల్సి ఉందని రైతు సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

## ఆదిలాబాద్‌లో పలు దళాలకు కమాండర్‌గా పని చేసిన శంకరన్న

బోథ్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో అరెస్టయిన నారాయణ రావు అలియాస్ శంకరన్న ప్రభాకర్ ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు పది ఏళ్ల కాలం పాటు దళనాయకుడిగా పని చేశారు. మొదట ఆదిలాబాద్ పిప్పలదరి దళ నాయకుడిగా పని చేశారు. 1984 నుంచి 87 వరకు పిప్పలదరి, ఇంద్రవెల్లి, బోథ్ దళాలకు శంకరన్న పేరుతో దళ నాయకుడిగా పని చేశారు. ఆ తర్వాత మహారాష్ట్ర ఇన్‌చార్జిగా వ్యవహరించారు. అనంతరం పార్టీ అధినాయకత్వం ఆయనను కేంద్ర కమిటీ సభ్యుడిగా నియమించింది. కరీంనగర్ జిల్లా జగిత్యాల ప్రాంతానికి చెందిన ఈయన చత్తీస్‌గడ్ రాష్ట్రంలో రూరల్ నక్సలిజం అభివృద్ధికి పని చేస్తున్నట్లు సమాచారం.

## బతుకుదెరువుకై వెళ్లి.. విగత జీవిగా వచ్చి

● దుబాయ్ వలన వెళ్లి అనారోగ్యం పాలైన తర్లపాడ్ వాసి

● తీవ్ర అస్వస్థతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ

సోమవారం తుది శ్వాస విడిచిన గణేష్



మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

ఖానాపూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటినిర్మాణం, తన భార్యతో పాటు ఇద్దరు పిల్లల భవిష్యత్తు బంగారు మయమవుతుందని ఆశించిన ఆ యువకుడి ఆశలు అడియాసలు అయ్యేందుకు ఎంతో సమయం పట్టలేదు. తన కలలను సాకారం చేసుకునేందుకు ఇంట్లోంచి ఆనందంగా విదేశాలకు వెళ్లిన గుగ్లావత్ గణేష్(38) అనే వ్యక్తి అంతు పట్టని అనారోగ్యం బారినపడి విగత జీవిగా ఇంటికి తిరిగి వచ్చిన హృదయ విదారకమైన ఘటన ఖానాపూర్ మండలం తర్లపాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే స్థానికులు తెలిపిన కథనం ప్రకారం... ఖానాపూర్ మండలం తర్లపాడ్ గ్రామానికి చెందిన గుగ్లావత్ గణేష్(38) తన భార్య మంజుల, కుమారుడు గోవర్ధన్, కూతురు నయనశ్రీతో కలిసి తర్లపాడ్‌లోని ఓ అద్దె ఇంట్లో నివసించేవాడు. కూలీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తూనే రూ. 9 లక్షలను అప్పు చేసి ఇంటిని నిర్మాణం చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించాలని విదేశాలకు వెళ్లాలని భావించాడు. దుబాయ్ దేశానికి భవన నిర్మాణ కార్మికుడిగా వీసా సంపాదించాడు. ఈ వీసా ద్వారా దుబాయ్ వెళ్లేందుకు గణేష్ రూ. 80 వేలను వెచ్చించాడు. ఇంటి నిర్మాణం కోసం చేసి రూ. 9 లక్షలతో పాటు విదేశాలకు వెళ్లేందుకు మరో లక్ష రూపాయలను అప్పు చేసి గణేష్ పది నెలల క్రితం దుబాయ్ వెళ్లాడు. దుబాయ్ దేశంలోని జెబులాలిలో పనిచేస్తూ అస్వస్థతకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. తర్లపాడ్ గ్రామానికి చెందిన పోలంపల్లి రాజేశ్వర్, సూర శేఖర్, మేకల మహేష్ అనే ముగ్గురు వ్యక్తులు వెళ్లి కంపెనీ నిర్వాహకులతో మాట్లాడారు. దీంతో ఈ నెల 18వ తేదీన గణేష్‌ను ఇండియాకు పంపించారు. తీవ్ర అస్వస్థతతో స్వదేశానికి వచ్చిన గణేష్‌ను హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గణేష్ సోమవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గణేష్ కుటుంబానికి రూ. 10 లక్షల వరకు అప్పు ఉందని, అతను మృతి చెందడంతో అతని భార్య, పిల్లలు పెద్ద దిక్కును కోల్పోయారని వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఘనంగా గణిత దినోత్సవం

ముథోల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీ అక్షర పాఠశాలలో సోమవారం జాతీయ గణిత దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల మ్యాథ్స్ వర్కింగ్ మోడల్స్, గణిత శాస్త్రం పోటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల డైరెక్టర్ సుభాష్ మాట్లాడుతూ... శ్రీనివాస రామానుజన్ స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ విద్యార్థులు గణితంపై ఎక్కువ మక్కువను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయికుమార్, అకాడమిక్ ఇన్‌చార్జి స్వప్న, గంధశర్మ, ఇన్‌చార్జి మధుసిందే, ఉపాధ్యాయులు మహేందర్, ప్రశాంత్, సంతోష్, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్వరం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతిని గణిత శాస్త్ర అధ్యాపకుడు సాయినాథ్, ప్రథమ, ద్వితీయ ఎంపీసీ గ్రూప్ విద్యార్థులతో కలిసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యా పకులు ప్రమీల రాణి, మహేందర్, సాయినాథ్, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్‌లోని వశిష్ట ఇంపెల్స్ స్కూల్‌లో సోమవారం గణిత శాస్త్ర పితామహుడు రామానుజన్ జయంతి వేడుకలు నిర్వహించారు. చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ప్రిన్సిపాల్ మాధవి, అకాడమిక్ డైరెక్టర్ దేవిదాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతన్నే దేశానికి వెన్నెముక

● జాతీయ రైతు దినోత్సవ వేడుకల్లో పలువురు వక్తలు



ఖానాపూర్‌లో జాతీయ రైతు దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న జాన్సన్ నాయక్

ఖానాపూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతన్నే దేశానికి వెన్నుముక అని... రైతు లేనిదే రాజ్యం లేదని... బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్, బీజేపీ నాయకులు రితేష్ రాథోడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్, మున్నూరు కాపు సంఘం తిమ్మాపూర్ అధ్యక్షులు కడకుంట్ల రవీందర్ సహా పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖానాపూర్‌లో తిమ్మాపూర్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో, బీజేపీ ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం తిమ్మాపూర్ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని రైతు నాగలి విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని 10 గ్రామాలకు చెందిన ఉత్తమ రైతులను ఘనంగా సన్మానించారు. మున్నూరు కాపు సంఘం తిమ్మాపూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తమ రైతుల సన్మాన కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, బీజేపీ జిల్లా నాయకులు ఆకుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్‌లు హాజరై రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. రైతులను గుర్తిస్తూ మున్నూరు కాపు సంఘం నిర్వహించిన ఉత్తమ రైతుల సన్మాన కార్యక్రమాన్ని వారు అభినందించారు. అనంతరం మండలంలోని మస్కాపూర్ శివారులో గల బీజేపీ కార్యాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో పలువురు రైతులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర నాయకులు రితేష్ రాథోడ్ చేతుల మీదుగా రైతులను శాలువాలతో సత్కరించారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో పలువురు వక్తలు మాట్లాడుతూ... సమాజంలో అన్నదా తప్రాముఖ్యతను కొనియాడారు. దేశానికే అన్నం పెట్టే రైతన్నకు కుల, మతాలు రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని వక్తలు పిలుపునిచ్చారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో ఆయా పార్టీల, సంఘాల నాయకులు బీసీ రాజన్న, నిమ్మల రమేష్, సిరిపురం నాగరాజు, కొక్కుల ప్రదీప్, కారింగుల సుమన్, బండారి రవీందర్, చిన్నం రవీందర్, బీసీ రమేష్, చింత పండు రవి, బోరుబొంతల వెంకటరాజం, గుమ్ముల రాజేందర్, గౌరీకర్ రాజు, అంకం మహేందర్, గోడపురం సందీప్, ఉపేందర్, స్వామి, తదితరులున్నారు.

### రైతు దంపతులను సన్మానించిన కడ్తాల్ ప్రాథమిక పాఠశాల

సోన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతు దినోత్సవం పురస్కరించుకొని కడ్తాల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు బడి పక్కన ఉన్న చిన్నయ్య వ్యవసాయ క్షేత్రానికి వెళ్లారు. ఈ సందర్భంగా చిన్నయ్య అనే రైతు విద్యార్థులతో మాట్లాడుతూ... పంట విధానం, పండించిన విధానం, ఎరువులు వాటిని వాడే విధానం గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చిన్నయ్య, గంగవ్వ రైతు దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజులదేవి, రమేష్ బాబు, ప్రభాకర్, వాణి, మంగమ్మ, శైలజ, రాధా, విద్యార్థులు పాల్గొన్నారు.

### ముథోల్‌లో..

ముథోల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అక్షర పాఠశాల, రవీంద్ర, సరస్వతీ శిశు మందిర్ పాఠశాలతో పాటు మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో గల ఫ్యూచర్ కాన్సెప్ట్ స్కూల్, వడ్తాల్‌లోని శ్రీవిద్య భాష్యం పాఠశాలలో సోమవారం జాతీయ రైతు దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతు వేషధారణలో ఉండి క్షేత్ర పర్యటన చేశారు. పంట చేనుకు వెళ్లి రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రైతుల ప్రాముఖ్యత గురించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు వివరించారు.

### కుంటాలలో..

కుంటాల, డిసెంబరు, 23 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక శాంతి నికేతన్ పాఠశాలతో పాటు కల్హారు వాసవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల సిబ్బంది క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లి వ్యవసాయ పనులపై అవగాహన కల్పించారు. వరి నాట్లు వేయడం, పురుగుల మందు పిచికారి చేయడం, కలుపు తీయడం, తదితర వ్యవసాయ పనులపై అవగాహన కల్పించారు. రైతులేనిదే రాజ్యం లేదని, నేటి సమాజంలో ప్రతి ఒక్కరికి కడుపునిండా అన్నం పెడుతున్నదని రైతన్నలేనని , రైతన్న దేశానికి వెన్నెముక లాంటి వాడని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది సాయిలు, శ్రీనివాస్, హరిప్రసాద్, సంతోష్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## మాజీ ప్రధాని పీవీకి ఘన నివాళి



నిర్మల్ కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతిని సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి సుస్థిర పాలన అందించిన మేధావి పీవీ అని కొనియాడారు. సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాదీ, దేవరకోట చైర్మన్ కొండా శ్రీనివాస్, యూత్ నాయకుడు హర్షిత్, ఎంబడి రాజేశ్వర్ పాల్గొన్నారు.

### పీవీకి బ్రాహ్మణ ఉద్యోగుల ఘన నివాళి

పీవీ నరసింహారావు 20వ వర్ధంతిని పట్టణంలోని బ్రాహ్మణ ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగులు, కరణం నియోగ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, దేశ ప్రధానిగా పని చేసిన సమయంలో ఆయన చేసిన ఆర్థిక సంస్కరణలు అభివృద్ధిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వర్ పాండే, భీమ్ రావు, గోవింద్ రావు, శిరీష్ కుమార్, కిషోర్, గిరీష్ కుమార్, నరేందర్, చైతన్య పాల్గొన్నారు.

## ప్రతీ ఇంటికి మంచినీటిని అందజేయడమే ప్రభుత్వ లక్ష్యం

● అమృత్ 2 స్కీం పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే వెడ్మబొజ్జు



ఖానాపూర్‌లో పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

ఖానాపూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణ వాసులతో ప్రతి మారుమూల ప్రాంతంలో నివసించే ప్రతి కుటుంబానికి మంచినీటిని అందజేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం ఖానాపూర్ పట్టణంలో అమృత్ 2 పథకంలో భాగంగా మంజూరైన తాగునీటి నూతన పైప్ లైన్ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ ప్రభుత్వం నిరంతరం పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్‌పాషా, సత్తనపల్లి పీఏసీఎస్ చైర్మన్ ఆమంద శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుప్పాల శంకర్, జిల్లా నాయకులు మడిగెల గంగాధర్, జన్నారపు శంకర్, పరిమి సురేష్, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ మాజీద్, గౌరై గంగాధర్, బొడ్డు గంగన్న, నిట్ట రవి, కట్ట శ్రీనివాస్, షైన శ్రీనివాస్, గుడాల రాజన్న, సార్ల నర్సయ్య, శేషాద్రి, తదితరులున్నారు.

## నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో

లక్ష్మణచాంద, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాచాపూర్, పొట్టపెల్లి(కె) గ్రామాల్లోని నర్సరీలను ఎంపీడీవో రాధా రాథోడ్ సోమవారం పరిశీలించారు. నర్సరీల్లో నాణ్యమైన విత్తనాలు ఉపయోగించి పూలు, పండ్లు, ఔషధ మొక్కలను పెంచి ప్రజలకు అందించాలని ఉపాధి హామీ, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అంతకుముందు ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు పంచాయతీ రాజ్ సిబ్బంది ఉన్నారు.

## ప్రభుత్వ పథకాలపై కళాజాతా ప్రదర్శన

కుంటాల, డిసెంబరు, 23: (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాల గురించి మండలంలోని విట్టాపూర్ గ్రామంలో సోమవారం కళాజాత ప్రదర్శన ద్వారా కళాకారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు నిషేదం, డ్రగ్స్ వాడకం వలన కలిగే అనార్థాల గురించి ఆట పాట రూపంలో అవగాహన కల్పించారు. అంతేగాకుండా సైబర్ నేరాలు, వీడియో కాల్స్ వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కళాకారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు తోట లక్ష్మన్, ఎలిశెట్టి సుదర్శన్ , రఘునాథ్, సుధాకర్, నాగరాజు, జితేందర్, తదితరులు ఉన్నారు.

## అగ్రి మార్కెటింగ్ విధానాల పత్రాల దహనం

నిర్మల్ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న అగ్రి మార్కెటింగ్ కొత్త విధానం ముసాయిదా పత్రాలను జాతీయ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో దహనం చేసినట్లు ఏఐకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య, వ్యాక సంఘం జిల్లా కార్యదర్శి నూతన్ కుమార్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్నలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ కేంద్రంగా జరిగిన రైతు ఉద్యమ హామీల్లో భాగంగా రద్దు చేసిన రైతు వ్యతిరేక చట్టాలను, దొడ్డి దారిన అగ్రి మార్కెటింగ్ విధానాల పేరుతో తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండించారు.


వద్యాల్‌లో అయ్యప్ప పడిపూజ కార్యక్రమం

## హరివరాసనం.. విశ్వమోహనం

లక్ష్మణచాంద, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హరివరాసనం.. విశ్వమోహనం వంటి జేసుదాసు పాడిన పాటలతో పాటు మరెన్నో అయ్యప్ప స్వామి భక్తి పాటలు పాడుతూ సాగిన అయ్యప్ప పడి పూజ కార్యక్రమం మండలంలోని వద్యాల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు చేయటంతో పాటు అయ్యప్ప భక్తి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం భిక్ష (అన్నదానం) నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించటానికి స్థానిక ప్రజలతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ధనుర్మాసోత్సవాలు


ధనుర్మాస ఉత్సవ పూజల్లో పాల్గొన్న భక్తులు


ప్రవచిస్తున్న పండితుడు అచార్య కళ్యాణ్

భైంసా, డిసెంబర్ 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతీ కాలనీ పరిధిలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు భక్తుల కోలాహలం మధ్య ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలోని విగ్రహాలకు పూలమాలలతో శోభాయమానంగా అలంకరించి తీర్చిదిద్దారు. పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో ఉత్సవాలకు హాజరవుతూ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతీ రోజు ఉదయం వేళలో వేద పండితులు ఇందూర్తి అచార్య కళ్యాణ్ చెప్పిన తిరుప్పావై ప్రవచనాలు భక్తుల ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతున్నాయి. ఆపద సమయంలో కాకుండా అన్ని వేళలా ఆలయాల సందర్శన చేపడుతూ ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని సూచించారు. సనాతనమైన సంస్కృతి, సంప్రదాయాలు, అచార వ్యవహారాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు.

## వైభవంగా అభయాంజనేయ స్వామి ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిర్మల్‌లోని శ్రీనగర్ కాలనీలోని అభయాంజనేయ స్వామి ఆలయ 8వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. పంచామృతాభిషేకం నిర్వహించి పుష్పాలతో అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన వితరణ గావించారు. పద్మశాలి సంఘ నాయకులు పాల్గొన్నారు.

# నత్త నడకకు చిరునామా!

- సాగునీరు అందేది ఉత్తదేనా..?! ● బీడు భూములు సస్యశామలం అయ్యేదెన్నడో!?
- జిల్లాలో ముందుకు సాగని 28 ప్యాకేజీ పనులు ● 11 సంవత్సరాల నుంచి 50 శాతం పనులు పూర్తి


డిస్ట్రిబ్యూటరీ కెనాల్

ముథోల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు పూర్తి కావడం లేదు. కాళేశ్వరం పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో రైతులకు సాగు నీరు అందని ద్రాక్షగా మారింది. గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. అక్కడి నుంచి తెలంగాణలోని ఆయా జిల్లాలో బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు ఎత్తిపోతల ద్వారా కాలువలకు నీరు అందించే దిశన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గంలోని సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు 2013 సంవత్సరంలో ఎత్తిపోతల పనులు (28 ప్యాకేజీ పనులు) చేపట్టి సుమారు 11 సంవత్సరాలు కావస్తునన పూర్తికాలేదు. సంబంధిత కాలువ పనులు సైతం జరగక నిలిచిపోయాయి. కాలువ పనులు త్వరితగతిన పూర్తి అయితే మీ బీడు భూములు పంట పొలాలతో కళకళలాడుతాయి. మా కష్టాలు గట్టెకుతాయన్న గంపెడు ఆశతో ఎదురుచూస్తున్న నేటికీ ఈ కాలువ పనులు పూర్తి కాలేకపోయాయని రైతులు అంటున్నారు. 11 సంవత్సరాల నుంచి 28 ప్యాకేజీ పనులు పూర్తి కాకపోవడంతో నిరాశనే మిగిలింది. వివరాల్లోకి వెళ్తే ముథోల్ నియోజక వర్గాని కి 28 ప్యాకేజీ కింద గత రాష్ట్ర ప్రభుత్వం రూ. 486 కోట్లను కే టాయించింది. ఇప్పటి వరకు సుమారు కేవలం రూ. 235 కోట్ల పనులు జరుగగా సుమా రు 250 కోట్ల పనులు జరుగ వలసి ఉంది. అయితే ప్రభు త్వం మళ్లీ 2022- 23కు గాను మళ్లీ ప్రభుత్వం 250 కోట్లకు బదులు రూ. 316 కోట్లకు పొడి గించింది. అయితే ఈ పనులు పూర్తయితే నియోజకవర్గంలోని ఉమ్మడి ముథోల్ మండలంతో పాటు తానూర్, కుభీ ర్, భైంసా మండలంలోని ఆ యా గ్రామాల్లోని సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ ఎత్తి పోతల పనులకు చిన్న కాలువలు, పెద్ద కాలువలు, తూమ్‌లు తదితర వాటికి సుమారు 3026 ఎకరాల భూమి అవసరమైతే ఇప్పటి వరకు కేవలం 650 మంది రైతుల నుంచి సుమారు 555 ఎకరాల భూమిని సర్వే చేశారు. ఇందులో ఈ పనులకు 475 ఎకరాల 37 గుం టల భూమికి సంబంధించిన 547 మంది భూమి కోల్పోయిన రైతులకు భూ నష్టపరిహారం డబ్బులను గతంలో అధికారులు అందజేశారు. మరో 111 ఎకరాల భూమి కోల్పోయిన 83 మంది రైతులకు నష్టపరి హారం రూపాయలు కూడా అందించారు. సుమారు మరో 400ల ఎకరాల సర్వే పూర్తి అయినప్పటికీ రెవెన్యూ అధికారులు క్లియరెన్స్‌కు పంపినట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. 3026 ఎకరాలకు పైగా భూ సర్వే చేసి అందులో భూమి కోల్పోయిన రైతులకు రైతుల వివరాలను సేకరించి నష్టపరిహారం ఇవ్వాల్సి ఉంది. కానీ ఈ పనులు ముందు నుయ్యి వెనుక గొయ్యి అన్నట్టు ప్రారంభమైన నుంచి 11 సంవత్సరాలు కావస్తున్న పనులు నడవకపోవడంతో రైతుల ఆశలు ఆవిరవుతున్నాయి. సదరు గుత్తేదారు దాదాపు మూడు సంవత్సరాల నుంచి ఈ పనులు జరుపడం లేదు. సంబంధిత కాంట్రాక్టర్ తమ వల్ల కాదని చేతులెత్తేశారు. అప్పటి నుంచి ఈ పనులకు బ్రేక్ పడింది.


పంప్‌హౌస్

### నత్తనే నయం..

కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా 28 ప్యాకేజీ ముథోల్ నియోజకవర్గంలో ప్రారంభించారు. దీంతో ఇక్కడ ఇరైతులు తమ భూములకు సాగునీరు అందుతుందని తాము పంటలు సాగు చేసుకోవచ్చని ఎన్నో కలలు కన్నారు. కానీ ఆ కల మాత్రం నేటికీ నెరవేరడం లేదు. కానీ సుమారు 11 సంత్సరాలు పూర్తి కావస్తున్న సంబంధిత పనులకు సంబంధించిన చిన్న, పెద్ద కాలువల నిర్మాణానికి భూములు సేకరణ పూర్తి కాలేదు. పనులు సైతం నత్తకు నడక నేర్పే విధంగా ఉందని అందని ద్రాక్షగా మిగిలిపోతుందని ఇక్కడి ప్రాంత రైతులు అంటున్నారు. 11 సంవత్సరాలకు కేవలం 48.23 శాతం పనులు అయితే మిగతా పనులకు ఎనిన సంవత్సరాలు పడుతుందని ప్రశ్నిస్తున్నారు. మెయిన్ కెనాల్ పనులు తదితర పనులు జరగాల్సి ఉంది. కానీ ఇప్పుడు ఆ పనులు జరగడం లేదు. 2013 నుండి 2015 సంవత్సరం వరకు పూర్తి చేయాల్సి ఉండగా ఈ పనులు పూర్తికాకపోవడంతో గడువు పొడిగింపుకై 2020 వరకు అప్పటి ప్రభుత్వానికి సంబంధిత గుత్తేదారు దరఖాస్తు చేసుకున్నారు. అయినా పనులు పూర్తి కాలేదు కదా మరలా సంబంధిత కాంట్రాక్టర్ పని చేయడానికి ముందుకు రాలేకపోవడంతో అప్పటి ప్రభుత్వమే కొత్త ఏజెన్సీని పిలిచి టెండర్ వేస్తామని వేయలేదు. ఏదేమైనా సంబంధిత 28 ప్యాకేజీ పనులు నేటికీ పూర్తి కాకపోవడంతో రైతులకు సాగునీరు అందని ద్రాక్షగా మిగిలింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభు త్వం పనులు వేగవంతం చేసేందుకు టెండర్‌ను పిలిచి త్వరితగతిన పూర్తి చేసినట్లయితే రైతు కన్న కలలు సాకారం అవుతాయని ఇక్కడి రైతులు పేర్కొంటున్నారు. నియోజక వర్గంలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించి నట్లయితే ప్రతీ రైతు ఆనందంతో ఉంటాడని రైతులు పేర్కొంటున్నారు. ఈ దిశన ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించి 28 ప్యాకేజీ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందితే సంతోషం ఉంటుందని రైతులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

### సాగునీరు అందితే మా పొలం సస్యశ్యామలం అవుతుంది..

● గట్టుపల్లి లక్ష్మణ్, రైతు



28 ప్యాకేజీ పనులు పూర్తయితే మాకు సాగునీరు అందుతాయి. పనులు పూర్తి చేసినట్లయితే మా పొలానికి నీరు అందుతుంది. నాకు ఉన్న ఎకరం 10 గుంటల భూమిలో సుమారు అరెకరం వరకు సంబంధిత అధికారులు హద్దులు పాతారు. కానీ నేటికీ భూ సేకరణ జరగలేదు. దానికి సంబంధించిన డబ్బులు రాలేదు. అధికారులు ఈ కాళేశ్వరం పనులు పూర్తి చేసి సాగునీరు అందివ్వాలని కోరుకుంటున్నాను.

### పంట పొలాలకు నీళ్లు అందించండి..

● శివురాం, రైతు



ఈ ప్రభుత్వమైన ప్రత్యేక శ్రద్ధ తీసుకొని 28 ప్యాకేజీ పనులు పూర్తిచేస్తే మా బీడు భూములు సా గునీరుతో కళకళలాడుతాయి. త్వరిత గతిన పనులు పూర్తిచేసి మా కలలను సాకారం చేయాలని కోరుతున్నాము.

### ప్రభుత్వం నుంచి ప్రియార్టీ రాగానే పనులు చేపడతాం..

● ఆర్. విఠల్, కాళేశ్వరం ఈఈ

28 ప్యాకేజీ పనులు మధ్యలో ఆగిపోయాయి. ఇప్పుడైతే ప్రభుత్వం నుంచి 28 పనులకు ప్రియార్టీ రాలేదు. అప్పటి వరకు 28 ప్యాకేజీ పనులకు సంబంధించి భూసేకరణ పనులు పూర్తి చేస్తాం. ప్రభుత్వం నుంచి ప్రియార్టీ వచ్చిన తర్వాతనే ముందుకెళ్తాం.

# కన్నుల పండువగా శిఖర ప్రతిష్ఠాపన


ధ్వజ స్తంభ స్థాపన కార్యక్రమం


కార్యక్రమానికి హాజరైన గ్రామస్థులు


నూతన ఆలయానికి కలశ స్థాపన చేస్తున్న పండితులు

బాసర, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాసర మండల కేంద్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పులకించిపోయింది. పురాతన పాప హరేశ్వర ఆలయం పునర్నిర్మాణం అనంతరం చేపట్టిన దేవతా మూర్తుల ప్రతిష్ఠాపన కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. గత రెండు రోజుల కిందట ప్రారంభమైన పూజలు చివరి రోజు సోమవారం వరకు కొనసాగాయి. చివరి రోజు బాసర గ్రామంలో ప్రతీఒక్కరు నూతన ఆలయంలో జరిగే పూజలు హాజరయ్యారు. గ్రామస్థుల రాకతో పండగ వాతావరణం కనిపించింది. దిన మంతా కలశ స్థాపన, ధ్వజ స్థంభం స్థాపన, ఇతర దేవతామూర్తుల స్థాపన వంటి వివిధ పూజ కార్యక్రమాలు దినమంతా పండితులు నిర్వహించారు. తరలివచ్చిన భక్తుల దేవత నామ స్మరణల మధ్య వేడుకలు కమనీయంగా జరిగాయి. భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, తదితర ప్రముఖులు హాజరై పూజలు నిర్వహించారు.

# ఘనంగా క్రిస్‌మస్ వేడుకలు

● కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


ఇచ్చోడలో క్రిస్‌మస్ వేడుకల్లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


హోలీ ట్రినిటీ పాఠశాలలో క్రిస్మస్ వేడుకల్లో చిన్నారుల నృత్యాలు

ఇచ్చోడ, డిసెంబరు, 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ యేటా నిర్వహిస్తున్న క్రిస్‌మస్ వేడుకలు సోమవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని గంగారెడ్డి గార్డెన్‌లో ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బోథ్ ఎమ్మెల్యే మొదటగా కేక్ కట్ చేసి అందరికి క్రిస్‌మస్ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి సెల్ఫీలు దిగి చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపి ఆనందింపజేశారు. బోథ్ నియోజకవర్గంలో ఉన్న సమస్త క్రైస్తవ సోదరులకు క్రిస్‌మస్ శభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇచ్చోడ మండల కేంద్రంలోని బస్టాండును సందర్శించి ప్రయాణికులతో ముచ్చటించారు. త్వరలోనే బస్టాండులో అన్నిరకాల సదుపాయాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రజల సౌకర్యార్థం పున ప్రారంభించిన బస్టాండు వాడకానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మణ్, పీటర్‌నాయక్, నర్సింగ్‌రావ్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### హోలీ ట్రినిటీ పాఠశాలలో..

ఇంద్రవెల్లి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని స్థానిక హోలీ ట్రినిటీ ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ పీఎల్ జోసెఫ్ ఆధ్వర్యంలో సోమవారం సెమి క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు పీఎల్. జోసెఫ్ చర్చి ఫాదర్ హాజరై క్రిస్మస్ సందేశమిచ్చారు. లోక కల్యాణం కోసం ఏసుక్రీస్తు ఈ లోకంలో జన్మిం చారని తెలిపారు. ప్రతీ విద్యార్థి మంచి నడవడిక, నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. అలాగే ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం చిన్నారులు క్రిస్మస్ పుట్టుకకు సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీమన్, విజయ్, నితేష్, ఉపాధ్యా యులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని..

## ఉరితాళ్లతో ముక్రా(కె) గ్రామ రైతుల నిరసన

ఇచ్చోడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రైతులు మళ్లీ ఆత్మహత్యలు చేసకునే రోజులు వస్తున్నాయంటూ ఇచ్చోడ మండలం ముక్రా(కె) గ్రామస్థులు సోమవారం పంట పొలంలో ఉరి వేసుకుని నిరసన తెలిపారు. రైతు రుణమాఫీ కాలేదు.. రైతు భరోసా రాలేదు.. ఇక మాకు దిక్కు ఉరే'.. అంటూ పంట పొలంలో ఒక కర్రకు తాడు కట్టి ఉరి పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ పూర్తయిందని పచ్చి అబద్ధాలు చెబుతున్నారన్నారు. కావాలంటే తమ గ్రామమైన ముక్రా(కె)కు వచ్చి సీఎం రైతుల గోస చూడాలన్నారు. సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదని, వెంటనే అందరికీ రుణమాఫీ చేయాలన్నారు. అలాగే వెంటనే రైతు భరోసా వేయాలన్నారు. లేనిపక్షంలో రైతులు మళ్లీ ఆత్మహత్మలు చేసుకునే రోజులు వస్తాయన్నారు. ఈ నిరసనలో గ్రామ రైతులు గాడ్గె మీనాక్షి, సుభాష్, ప్రహ్లాద్, సంతోష్, విఠల్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.


ముక్రా(కె) గ్రామంలో ఉరి వేసుకుని వినూత్న నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

## ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి సీఎం కప్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన మర్లపల్లి విద్యార్థులు

బోథ్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్లపల్లి గ్రామానికి చెందిన నూతన పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొని జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కస్తూరి హనుమాండ్లు తెలిపారు. ఈ నెల 27 నుంచి హకీంపేట్‌లో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్కే షబ్బీర్ తెలిపారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల సిబ్బంది అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ వనిత హర్షం వ్యక్తపరిచారు.

## పర్యావరణ హితంగా పెళ్లి కార్యం!


పెళ్లిలో వినియోగిస్తున్న వెదురు బుట్టలు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలయాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగిస్తూ పర్యావరణానికి హాని కలిగిస్తున్న క్రమంలో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన కొడుకు పెండ్లికి పర్యావరణ హిత వస్తువులను పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన గిరిష్ కౌటిక్వార్ స్థానిక ఆకాశవాణిలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్నాడు. తన కుమారుడి పెళ్లి సందర్భంగా పసుపు బొట్టు కార్యక్రమంలో ప్లాస్టిక్ వస్తువులను కాకుండా వెదరు బుట్ట లను వినియోగించి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా గిరిష్ మాట్లాడుతూ పర్యా వరణానికి హాని కలిగించకుండా తన కొడుకు పెళ్లి జరిపించాలని ప్లాస్టిక్‌ను విని యోగించడం లేదన్నారు. వాతావరణంలో కాలుష్యాన్ని నివరించడంలో భాగంగా తొలి అడుగుగా తమ వంతుగా సహజ సిద్ధమైన వస్తువులను వినియోగిస్తున్నామని తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో కాలభైరవ జన్మాష్టమి వేడుకలు

నిర్మల్ అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ పట్టణంలోని బత్తిస్ ఘడ్ ప్రాంతంలో ఉన్న కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలభైరవ జన్మాష్టమి సందర్భంగా స్వామివారికి దీప, దూప నైవేద్యాలతో స్వామివారిని అలంకరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు డి. శ్రీనివాస్, పి. సురేష్, ముదుల్కర్ రాము, సూత్రావే రాము, మాల్వేకర్ ఆనంద్, ఈశ్వర్, అంబేకార్ దత్తు, అంబేకార్ కిషన్, డౌలాగర్ శ్రీనివాస్, అప్పవర్ నారాయణ, ఏ. భూమన్న, దాంజేవర్ మోహన్, అంబేకార్ వరప్రసాద్, అంబేకార్ వికాస్ పాల్గొన్నారు.


కాలభైరవ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

## జాగ్రత్తలతో దొంగతనాల నియంత్రణ : సీఐ

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పండగల నేపథ్యంలో ఊళ్లకు వెళ్లే వారు దొంగతనాల నివారణకు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని చించర్వాడలో స్థానిక ప్రజలకు దొంగతనాల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే స్టేషన్‌కు లేదా డయల్ 100కు ఫోన్ చేయాలని, అలాగే, సైబర్ క్రైమ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆదివాసీ సంఘాల నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి : ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ గిరిజనుల సంస్కృతీ, సంప్రదాయాలు చాలా గొప్పవని, భావితరాలకు అందించాల్సిన అవసరం ప్రతీఒక్కరిపై ఉందని ఖానాపూర్ నియోజక వర్గ శాసన సభ్యుడు వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. సోమవారం ఉట్నూర్ మండలకేంద్రంలో మధ్య ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఆదివాసీలు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో సమావేశమై పలు విషయాల పై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తరతరాలుగా ఆదివాసీలు ప్రకృతినే దైవంగా భావించి పూజలు చేయడం అనవాయితి అని పేర్కొన్నారు. దేశంలో ఉన్న ఆదివాసీలు నిత్యం ఇతర రాష్ట్రాల ఆదివాసీలతో కలుస్తూ ఉండాలని సూచించారు. అన్ని రాష్ట్రాల ఆదివాసీలు ఐక్యంగా ఉండలని తెలిపారు. గోండి ధర్మ రక్షణకు ప్రతీఒక్కరు పాటు పడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్రంభీం మనవడు కుమ్రం సోనేరావు, జిల్లా రాయిసెంటర్ సార్మేడి దుర్గుపటేల్, రాజ్ గోండు సేవ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మంగం విషంరావు, ఆదివాసీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## పంటకు మద్దతు ధర కల్పించాలి : బండి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతీ పంటకు మద్దతు ధర కల్పించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అఖిల పక్షం రైతు సంఘం నాయకులు బండి దత్త్రాత్రి అన్నారు. మద్దతు ధరకు కల్పించాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో సోమవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు చేపట్టిన ఆందోళనకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మరో చేపడతామన్నారు. అంతర్జాతీయ రైతు దినోత్సవాన్ని సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు స్థానిక కిసాన్ విగ్రహానికి పూలమాలలు వేశారు. రైతులకు ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిరణ్, సచిన్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటాలు : బీఆర్‌ఎస్‌వీ

ఉట్నూర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటాలు చేపట్టాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారని బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో కవితను కలిసి పూలమొక్క అందించిన సందర్భంగా ఆమె మాట్లాడినట్లు తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా విద్యార్థుల సమస్యలపై పోరుబాట పట్టాలని, అదేవిధంగా జిల్లాలోని బీఆర్ ఎస్వీ, బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్సీ కవిత సూచించినట్లు ధరణి రాజేశ్ పేర్కొన్నారు.



వ్యవసాయ పనిముట్లపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## 'రైతు లేనిదే.. రాజ్యం లేదు'

బోథ్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతు లేనిదే రాజ్యం లేదని, రైతు దేశానికి వెన్నెముక లాంటివాడని నాగభూషణం పాఠశాల ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాలలో విద్యార్థులకు రైతు గొప్పతనాన్ని వివరించారు. రైతు కష్టపడి పండించిన పంటని మనం ఆహారం తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి చెందిన రైతులు మోహన్‌రెడ్డి, పాటిల్, నాగనాథ్, మల్లెపూల లింగన్న, శంకర్, శకుంతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే, రైతు దినోత్సవం సందర్భంగా సోనాల మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాలలో విద్యార్థులకు వ్యవసాయ పనిముట్లపై అవగాహన కలిగించారు. రైతులు వాడే ఎడ్లబండి, నాగలి గుంటుక అరక కూరే, గొర్రు, పారా, పారా కట్టే, గడ్డపార, తదితర వ్యవసాయ పనిముట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో ప్రిన్సిపాల్ కృష్ణచైతన్య, డైరెక్టర్ కె.సుద్దోదన్, మునిగేల శ్రీధర్, నరేందర్, యల్ల చిన్నారెడ్డి, తదితరులున్నారు.

### ● ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

**తలమడుగు(ఆంధ్రజ్యోతి):** మండలంలోని బరంపూర్ గ్రామంలో జాతీయ రైతు దినోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఐదుగురు ఉత్తమ రైతులని గుర్తించి రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొరన్న, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇందులో ప్రతాప్, నారాయణ రెడ్డి, కిసాన్ మిత్ర ఫీల్డ్ కో ఆర్డినేటర్స్ రమాకాంత్, రాకేష్, స్థానిక వ్యవసాయశాఖ ఏఈవో మనీషా, పెద్దసంఖ్యలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

● ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిరసన తెలుపుతున్న రైతులు




# అసంపూర్తిగానే.. రుణమాఫీ!

- జిల్లాలో నాలుగు విడతల్లోనూ రుణమాఫీ కాలేదంటూ రైతుల ఆగ్రహం
- రూ.2లక్షలకు పైబడి ఉన్న రుణంపై స్పష్టత కరువు
- నాల్గవ విడతను విడుదల చేసినా.. బ్యాంకులో జమ కాని నగదు
- అధికారుల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు
- అవగాహన కల్పించని వ్యవసాయ శాఖాధికారులు
- జిల్లావ్యాప్తంగా మొత్తం లక్షా 65వేల మంది రైతులు

ఆదిలాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రూ.2లక్షల రుణమాఫీపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రుణమాఫీ ప్రక్రియ దాదాపుగా పూర్తయినట్లు అధికారులు చెబుతున్నా.. ఇంకా అసంపూర్తిగానే మిగిలి ఉందంటూ రైతులు చెబుతున్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదంటూ ఆందోళనలు, నిరసనలకు దిగుతున్నారు. ఈ యేడు జూలై 18 నుంచి నవంబరు 30 వరకు నాలుగు విడతల్లో రుణమాఫీ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. అయితే మూడు విడతల్లో రుణమాఫీ కాని రైతులకు నాల్గవ విడతలో రుణమాఫీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో లక్షా 65వేల మంది రైతులు ఉన్నారు. ఇందులో లక్షా 17వేల మంది రైతులకు పంట రుణాలను తీసుకున్నారు. రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న రైతులు సుమారుగా 98వేల మంది ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు మూడు విడతల్లో 55వేల 961 మంది రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసింది. అలాగే ఇటీవల నవంబరు 30న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుసభలో నాల్గవ విడతను ప్రకటించారు. ఇందులో 6,607 మంది జిల్లా రైతులు ఉన్నారు. జాబితాను విడుదల చేసి 25 రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే వివిధ సాంకేతిక, ఇతర కారణాలతో జిల్లాలో సుమారుగా 30 వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదని రైతు సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వెంటనే ప్రతిరైతుకు 2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలకు దిగుతున్నారు. ఇప్పటికే ప్రజా ఫిర్యాదుల విభాగంలో పలువురు రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు కూడా చేస్తున్నారు. స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించిన వ్యవసాయ శాఖాధికారులు ప్రభుత్వానికి నివేదికను పంపించినా.. పూర్తిస్థాయిలో రుణమాఫీ కావడం లేదంటూ రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ చూసినా పంట రుణాల మాఫీ పైననే రైతులు చర్చించుకోవడం కనిపిస్తోంది. రుణమాఫీ జరిగిన రైతుల్లో ఆనందం కనిపిస్తున్నా.. రుణమాఫీ కానీ రైతులు ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిగితా రైతులకు అసలు రుణమాఫీ అవుతుందా? కాదా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

### ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదు

**: బింగివిఠల్ రైతు, పిప్పల్‌కోటి, భీంపూర్ మండలం**



ప్రభుత్వం రుణమాఫీ చేసినా.. మా కుటుంబానికి ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదు. నా పేరు మీద ఎకరం భూమి ఉంది. దీనికి గాను రూ.60 వేల పంట రుణం తీసుకున్నాను. అలాగే నా భార్య బింగి రుక్మిణి పేరిట ఉన్న నాలుగు ఎకరాల భూమిపై రూ.లక్షా 60వేలు రుణం తీసుకున్నాం. అలాగే నా కొడుకు బింగి నవీన్ పేరిట రూ. లక్షా 40వేలు రుణం తీసుకున్నాం. అందరి రుణాలు రూ.రెండు లక్షల లోపే ఉన్నాయి. కానీ మా కుటుంబంలో ఎవరికీ రుణమాఫీ కాలేదు.

### ఆందోళనలకు దిగుతున్న రైతులు

రుణమాఫీ ప్రక్రియపై మొదటి నుంచి నిరసనలు, ఆందోళనలు, ఆగ్రహం వ్యక్తమవుతూనే ఉంది. మొదటి విడతలోనే రైతులందరికీ రుణమాఫీ కాలేదంటూ రోడ్డెక్కి ఆందోళనలకు దిగారు. తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో కొంతమంది రైతులు ఏకంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్రను నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం పలువురు రైతులపై కేసులను కూడా నమోదు చేసింది. అలాగే ఇటీవల ఇంద్రవెల్లి మండలంలో కొంత మంది రైతులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. తాజాగా ఇచ్చోడ మండలం ముక్ర(కె) గ్రామంలో

(తరువాయి 6వ పేజీలో...)

## అర్జీలను ఎప్పటికప్పుడే పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్ రాజర్షిషా ● ప్రజా ఫిర్యాదుల విభాగానికి 104 దరఖాస్తులు ● పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ మండలాల నుంచి వచ్చిన దరఖాస్తుదారుల నుంచి అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడే పరిష్కరించాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో 104 అర్జీలు స్వీకరించడం జరిగిందని తెలిపారు. భూ సమస్యలు, ఉద్యోగం కోసం, తదితర సమస్యలపై దరఖాస్తులు అందజేశారన్నారు.

### ● 'మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధం మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు చిరంజీవి, మంతెన కాంతారావ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సంరదర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఒక నెల పెండింగ్ వేతనం ఈ క్రిస్మస్‌కు అందేవిధంగా మున్సిపల్ కమిషనర్‌కి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో దాదాపు 350 మంది కార్మికులు పని చేసున్నారు. వారు ఆదిలాబాద్ చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్నారు వారు పొద్దున పని నిమిత్తం నాలుగు గంటలకు ఆదిలాబాద్ పట్టణానికి చేరుకొని పని చేయాల్సి ఉంటుందన్నారు. వారు రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారని, వారికి వెంటనే ప్రభుత్వ భూమి కేటాయించి ఇందిరమ్మ ఇళ్లను కట్టించి ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో సురేష్, శాంతమ్మ, నాగరాజు, ఆనంద్, సతీష్, శంకర్, శ్రీను, నిఖు , రామ్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తును అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

### ● 'అనుమతులు లేని కొనుగోళ్లు.. చర్యలు తీసుకోవాలి'

అనుమతులు లేకుండా పత్తి, సోయా, కందులు కొనుగోలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషాను అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ సమావేశ మందిరంలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. దళారుల నుంచి రైతులను కాపాడాలని విన్నవించారు. రైతుల నుంచి పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మడావి సుంగు, మడావి భీన్నం, పెందుర్ మహదేవ్, నగేష్, రేణుక, షబానా పాల్గొన్నారు.

### ● 'ఉపాధి లేకుండా చేశారు..!'

'తనకు ఉపాధిని దూరం చేశారని ఓ బాధితురాలు ప్రజావాణికి వచ్చి ఆవేదన వెల్లబుచ్చారు. గుడిహత్నూర్ మండలం సీతాగొందికి చెందిన అనిత టీజీబీ బ్యాంక్ మిత్రగా 10 ఏళ్ల నుంచి పని చేస్తున్నారు. అయితే ఐకేపీ బ్యాంక్ సిబ్బంది కుమ్మక్కై తొమ్మిది నెలల నుంచి జీతం ఇవ్వకుండా తనను ఉద్యోగం నుంచి తొలగించారని బోరున ఏడుస్తూ వాపోయారు. బ్యాంకుకు రానివ్వడం లేదని, చంపేస్తామని బెదిరిసున్నారని ఆరోపించారు. కలెక్టర్ తనకు న్యాయం చేయాలని కోరారు.

## పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే : ఎంపీడీవో

నార్నూర్, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని లబ్ధిదారుల వివరాలు పూర్తిగా సేకరించాలని అధికారులకు ఎంపీడీవో జవార్ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం మండలంలోని నాగలకొండ గ్రామ పంచాయతీలోని బలాన్పూర్, దేవాపటార్, మరప్పగూడ, తదితర గ్రామాలలో స్వయంగా వెళ్లి అధికారుల సర్వే పని తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివరాల నమోదు అంశంలో ఎలాంటి తప్పులు లేకుండా ఆధార్, ఇతర ధ్రువపత్రాలు, లబ్ధిదారుల వద్ద సేకరించి పూర్తిగాచేయాలని, గడువులోగా అందించాలి అని ఆయన సూచించారు. వారి వెంట అధికారులు, గ్రామస్థులు ఉన్నారు.

## 'బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలి'

ఇంద్రవెల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని ఆ పార్టీ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు రాథోడ్ రాధిక అన్నారు. సోమవారం మండలంలోని హర్కాపూర్ తండా గ్రామంలో బూత్ స్థాయి కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అవినీతి, దోపిడీ విధానాలను ప్రజలకు తెలపాలన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లీ రాజలింగం, నాయకులు పవార్ మనోజ్, ఆడే రమేష్, రాథోడ్ సంజు, కిషోర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



గిరిజన దర్బార్‌లో అర్జీలను స్వీకరిస్తున్న ఖుష్బుగుప్త

## గిరిజన సమస్యలను పరిష్కరించాలి : పీవో

ఉట్నూర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేటప్పాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. గాదిగూడ మండలం మారుగూడ గ్రామస్థులు తమ గ్రామానికి వంతెన నిర్మాణం చేయించాలని, సిర్పూర్(టి) మండలం భూపాలపాలెం గ్రామానికి చెందిన సిడాం వెంకట్ తన వ్యవసాయంలో విద్యుత్, బోరు మంజూరు కల్పించాలని, సిర్పూర్(యు) మండలం సెట్టిహాడుపునూర్ గ్రామానికి చెందిన వెడ్మచిన్ను తనకి ఆర్ఓఎఫ్ఆర్ పట్టా మంజూరు కావాలని కోరారు. పింఛన్, రెండు పడక గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఇందులో ఏపీవో జనరల్ జాదవ్ వసంతరావు, ఏపీవో పీవీటీజీ మేస్రం మనోహర్, సీడీపీవో ఉమాదేవి, మేనేజర్ లింగు, జేడీఎం నాగభూషణం, డీపీవో ప్రవీణ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి వరంగల్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతీరోజు రాత్రి 9గంటలకు ఆదిలాబాద్ నుంచి ఎక్స్‌ప్రెస్ బస్సు బయలుదేరి ఉట్నూర్, జన్నారం, లక్షెటిపేట్ కరీంనగర్ మీదుగా వరంగల్‌కి ఉదయం 4గంటలకు చేరుకుంటుందని డిపో మేనేజర్ కల్పన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే వరంగల్ నుంచి ఉదయం 10గంటలకు బయలుదేరి సాయంత్రం 5.15 ఆదిలాబాద్ జిల్లాకు చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీలో ప్రయాణం చేయాలని కోరారు.

## భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న చండీ యాగం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని డైట్ మైదానంలో వైభవంగా ఆయుత చండీ యాగం భక్తిశ్రద్ధల నడుమ కొనసాగుతోంది. రెండవ రోజు సోమవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపనంద స్వామిజీ నేతృత్వంలో యాగ క్రతువును చేపట్టారు. కాగా, ఉదయం శ్రీలక్ష్మిగణపతి, శ్రీరుద్ర మృత్యుంజయ సహిత అమృత పాశుపశాస్త్ర హోమాలను చేపట్టగా.. ఎమ్మెల్యే పాయల శంకర్ పాల్గొన్నారు.

# అసెంబ్లీ దృష్టికి సీఆర్టీల సమస్యలు : ఎమ్మెల్యే అనిల్



సీఆర్టీలకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్

ఉట్నూర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్సి టీచర్ల సమస్యలను అసెంబ్లీ సమావేశాలలో మాజీ మంత్రి హరీష్‌రావు ఆధ్వర్యంలో అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట సీఆర్టీలు తలపెట్టిన సమ్మె 8వ రోజుకు చేరిన సందర్భంగా ఖానాపూర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఇన్‌చార్జి జాన్సన్‌నాయక్‌తో కలిసి సంఘీభావం తెలిపారు. అసెంబ్లీ సమావేశాలలో ప్రతిపక్షంలో ఉన్న తమ గొంతును ప్రభుత్వం వినిపించుకోవడం లేదని, అయినా కూడా మాజీ మంత్రి హరీష్‌రావుతో కలిసి సమస్య వివరించడంతో అసెంబ్లీలో కూడా చర్చకు వచ్చిందన్నారు. ఈ సందర్భంగా సీఆర్టీల కోరిక మేరకు రూ.51 వేల నగదు తనవంతుగా ఆర్థిక సహాయం అందించారు. ఆ తర్వాత బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ మాట్లాడుతూ సీఆర్టీల సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, మాజీ జడ్పీటీసీ చారులత రాథోడ్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జాదవ్ శ్రీరామ్, తోటి సంఘం నాయకులు రవీందర్, పెందూరు పుష్పారాణి, కాటం రమేష్, సింగారే భారత్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

### ● 'సీఆర్టీల సమ్మె పరిష్కారానికి ప్రభుత్వం కమిటీ వేయాలి'

గత 8రోజులుగా సమస్యలు పరిష్కరించాలని ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం ముందు సమ్మె తలపెట్టిన కాంట్రాక్ట్ రెసిడెన్సీ టీచర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సబ్ కమిటీ వేయాలని విద్యావేత్త, ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సీఆర్టీల సమస్యలను ప్రభుత్వానికి తెలిపి సానుకూలంగా స్పందించాలని కోరారు. రెండు దశాబ్దాలుగా సీఆర్టీలుగా సేవలు అందిస్తున్న సీఆర్టీలను భయభ్రాంతులకు గురి చేయడం సరైనది కాదని అన్నారు. సీఆర్టీలు న్యాయబద్ధమైన కోరికలు మాత్రమే అడుగుతున్నారని అన్నారు. ఆయన వెంట కోడం శ్రీనివాస్, వినంత్‌రావు, రమేష్, వంశీకృష్ణ, విద్యా రాణి, వందన, తదితరులు పాల్గొన్నారు.